

రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

## రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

**హైదర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు నుంచి తులసి వనం వరకు రూ.30 లక్షలతో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఎన్నోఏళ్ల ట్రాఫిక్ సమస్య నేటితో తీరనుందని, ప్రజల సౌకర్యార్థం, మెరుగైన జీవన ప్రమాణాల కోసం రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. రోడ్డు విస్తరణ పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆల్విన్‌కాలనీ ఫేజ్-1లో జలకన్య హోటల్ వద్ద రూ.27 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈఈ గోవర్దన్‌గౌడ్, ఏఈ శ్రావణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్, నాయకులు కాశినాథ్‌యాదవ్, శివరాజ్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

**మియాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బి-బ్లాక్‌కు చెందిన సుభద్ర కుమారుడు సుమంత్ ఇంజనీరింగ్ చదువు కోసం రూ.1,26,500 ఆర్థిక సాయం చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును విద్యార్థి, అతని తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విద్యార్థి తండ్రి వీరయ్యయాదవ్ మరణించడంతో వారి ముగ్గురు పిల్లలను దత్తత తీసుకుని వారి చదువుకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. పెద్దకుమార్తె గీత ఇంజనీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుందని, రెండవ కుమార్తె పీజీ చదువుతుందని, కుమారుడు ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్నాడని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇసుక మేటలను తొలగించాలి

**షాపూర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్లపై ఇసుక, చెత్త పేరుకుపోయి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీటికి ఇసుక రోడ్లపైకి కొట్టుకొచ్చి మేటలుగా పేరుకుపోతున్నది. దీంతో ప్రజలు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇసుకతో వాహనాలు అదుపుతప్పి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీహెచ్‌ఎంసి సిబ్బంది రోడ్లపై పేరుకుపోయిన ఇసుక మేటలను తక్షణమే తొలగించి ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

**జీడిమెట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఈ నెల 24వ తేది ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు షాపూర్‌నగర్ ఏడీఈ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులు హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

### ఇస్కాన్ ఆధ్వర్యంలో
## 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ జన్మాష్టమి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ శాఖ ప్రతినిధులు

**నల్లకుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తివేదన స్వామి ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. గురువారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ కో-ఆర్డినేటర్ శ్రీవాణి, ప్రతినిధులు లలితకాబ్రా, అంజనాదేవి, సునీల్‌రాఠి మాట్లాడారు. 6వ తేదీ ఉదయం 7.30 మహాఅభిషేకం, మధ్యాహ్నం మహా హారతి, కీర్తన మేళ, అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు గానం, నృత్యం, కలరింగ్, డ్రాయింగ్, వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్, శ్లోక పఠనం తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. 26 సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి గల వారు వివరాల కోసం 9440486792 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

## కెమికల్ లీక్.. కళ్ల మంటలు, వాంతులు



కెమికల్ నుంచి వస్తున్న దట్టమైన పొగలు

**బాలానగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** బాలానగర్ కో ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ లిమిటెడ్ (సీఐఈ) పరిధిలో ఉన్న శ్రీ సాయి లాజిస్టిక్ ట్రాన్స్‌పోర్టులో వచ్చిన డ్రమ్ముల నుంచి కెమికల్ లీకైంది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఒక్కసారిగా పొగలు కమ్ముకోవడంతో ట్రాన్స్ పోర్టుకు పక్కనే ఉన్న పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు కళ్ల మంటలు, వాంతులు చేసుకుంటూ ఇబ్బందులు పడ్డారు. స్పందించిన ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు గుంతలు తవ్వి వాటిలో డ్రమ్ములు సిలిండర్లు వేసి మట్టి కప్పడంతో రెండు గంటల తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. సమాచారం అందుకున్న బాలానగర్ పెట్రో మొబైల్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని విషయంపై ఆరాతీశారు. మందులు తయారు చేసే రెడ్డిల్యాబ్‌లకు అందజేయడానికి గుజరాత్ నుంచి టినాల్ క్లోరైడ్ (టీసీ) అనే కెమికల్ వచ్చిందని, లీకేజీ కావడంతో సమస్య తలెత్తిందని, దీని వలన ప్రాణ హానీ ఏమి ఉండదని ట్రాన్స్‌పోర్టు నిర్వాహకుడు యాదగిరి పోలీసులకు తెలిపాడు.

## అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

**హైదర్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వివాహిత విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... బండి దివ్యకృప(38), భర్త ప్రేమ్‌కుమార్‌తో కేపీహెచ్‌బీకాలనీ భగత్‌సింగ్‌నగర్‌లో నివసిస్తున్నారు. రెండు సంవత్సరాలుగా దివ్యకృప అనారోగ్యంతో బాధపడుతుంది. చాలా ఆస్పత్రుల్లో చూపించిన ఫలితం లేకపోవడంతో ఈ నెల 14న ఇంట్లో ఎవరులేని సమయంలో విషం తాగి భర్త ప్రేమ్ కుమార్‌కు ఫోన్‌చేసి తాను చనిపోతున్నట్లు చెప్పింది. వెంటనే ఇంటికి చేరుకున్న అతను దివ్యకృపను గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## వ్యక్తిగత సమస్యలతో యువకుడు



జగదీష్‌రెడ్డి(ఫైల్)

**జీడిమెట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** వ్యక్తిగత సమస్యలతో ఓ యువకుడు హెచ్‌ఎంటీ కాలనీ జంగల్‌లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా, శివంపేట్ మండలం, ఎదులాపూర్ గ్రామానికి చెందిన కొమరెల్లి చంద్రారెడ్డి, ఇందిరమ్మలకు ఇద్దరు కుమారులు. తండ్రి చంద్రారెడ్డి వాటర్ వర్క్స్ మియాపూర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నకుమారుడు జగదీష్‌రెడ్డి(24) క్రెడిట్ కార్డు కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తు న్నాడు. వీరు షాపూర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన జగదీష్‌రెడ్డి రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో తన సోదరుడు ఫోన్ చేశాడు. తాను వ్యక్తిగత సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని చెప్పడంతో ఇంటికి వస్తే మాట్లాడుకుందామని చెప్పాడు. రాత్రి 11.30 గంటలకు ఇంటికి వచ్చిన జగదీష్‌రెడ్డి ఇంటి ముందు పార్కుచేసిన తన పల్సర్ బైక్‌ను తీసుకుని వెళ్లాడు. తన స్నేహితులకు వీడియోకాల్ చేసి చనిపోతున్నానని చెప్పాడు. ఈ విషయం స్నేహితులు కుటుంబ సభ్యులకు చెప్పగా వారు రాత్రంతా వెతికారు. తెల్లవారు జామున హెచ్‌ఎంటీ కాలనీలోని చెట్టుకు ఉరేసుకుని వేలడుతుండగా స్థానికులు గుర్తించి జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కుటుంబ సభ్యులకు తెలిపి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







# రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..?

- భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- మోకాలిలోతు గుంతలతో వాహనదారుల ఇక్కట్లు



దీప్తి శ్రీనగర్ నుంచి ధర్మపురి క్షేత్రానికి వెళ్లే రహదారి

**మియాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఎక్కడ చూసినా మోకాళ్లలోతు గుంతలు ఏర్పడంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనేకమంది రాత్రిపూట గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతర్గత, ప్రధాన రహదారుల్లో సైతం గుంతలు ఏర్పడంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో గల్లీ నుంచి ప్రధాన చౌరస్తా వరకు తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. మరోపక్క అభివృద్ధి పనుల పేరుతో రోడ్లను తవ్వి వదిలేయడంతో ఎక్కడ బడితే అక్కడ మట్టికుప్పలు ఉండటంతో ఆ ప్రాంతాల్లో వాహనాలు నిలిచిపోతున్నాయి. నియోజకవర్గంలో ఇటీవల కోట్ల రూపాయాలతో నిర్మించిన రహదారులు వర్షాలకు కొట్టుకుపోయాయి. మియాపూర్, హెచ్‌ఎంటీ, ఎంఎనగర్, ప్రశాంత్‌నగర్, హఫీజ్‌పేట, చందానర్, లింగంపల్లి, పాపిరెడ్డికాలనీ, రాయదుర్గం, కొండాపూర్, మాదాపూర్ ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా రహదారులకు మరమ్మతులు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేయాలి: బీఆర్ఎస్



మున్సిపల్ కార్యాలయం ఎదుట అమరువీరుల స్తూపం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**దుండిగల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపు మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు గండిమైసమ్మ చౌరస్తాలోని మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలో ఉన్న అమర వీరుల స్తూపానికి నివాళులర్పించి బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రేషన్ కార్డును సాకుగా చూపి రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నంచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయాలని కోరారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ధర్నాలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మహిళా నాయకురాళ్లు కార్యకర్తలు ఉన్నారు.

## రేపు ఈఎంఆర్ఐలో ఉద్యోగ ఇంటర్వ్యూలు

**మేడ్చల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** ఈఎంఆర్ఐ(108) సంస్థలో డ్రైవర్లు, మెడికల్ టెక్నీషియన్ల నియామకాలను చేపడుతున్నట్లు ఈఎంఆర్ఐ ప్రోగామ్ మేనేజర్ షేక్ జాన్ షాహీద్ తెలిపారు. ఈనెల 24న కింగ్‌కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తమ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రైవర్ కోసం వయసు 23-35 సంవత్సరాలు, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. మెడికల్ టెక్నీషియన్ కోసం అభ్యర్థులు 30 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని డీ ఫార్మసీ, నర్సింగ్‌తో పాటు ఇతర ఆరోగ్యశాఖకు సంబంధించిన డిప్లమా చదివి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జీరాక్స్ సెట్‌ను తీసుకురావాలని తెలిపారు.

## అందుబాటులోకి మెట్రో డీలక్స్ మంత్లీ పాస్

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** గ్రేటర్ హైదరాబాద్ జోన్ ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం నుంచి మెట్రో డీలక్స్ మంత్లీ బస్‌పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు టీజీఎస్‌ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. పాస్‌తో మెట్రోడీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. పాస్‌హోల్డర్లు సిటీ, సబర్బన్ పరిధిల్లో తిరిగే అన్ని బస్సుల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు.



సమావేశంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ నాయకులు

## 26న కృష్ణస్వామి జయంతి వేడుకలు

**పద్మారావునగర్, ఆగస్ట్ 22, (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్ నగర తొలిమేయర్ కొర్వి కృష్ణస్వామి జయంతి వేడుకలను ఈనెల 26వ తేదీన సికింద్రాబాద్‌లోని ముదిరాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సికింద్రాబాద్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు డి.సదానంద్, జి.దివాకర్, శ్రీకాంత్, సురేష్, నర్సింగరావులు మాట్లాడుతూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ, కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి మహోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, మాజీ శాసనసభ సభ్యుడు కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతారని తెలిపారు.



బాలికను చేరదీసిన నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు

## తల్లిదండ్రులు మందలించారని ముంబైకి వెళ్లబోయిన బాలిక

- నాంపల్లి రైల్వే స్టేషన్‌లో చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు

**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** తల్లిదండ్రులు మందలించారన్న నెపంతో ఓ బాలిక గుట్టుచప్పుడు గాకుండా ముంబైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన మహ్మద్ జాహంగీర్ కుమార్తె(17) ఇంట్లో కుటుంబ సమస్యలు, తల్లిదండ్రులు మందలిస్తున్నారన్న నేపథ్యంతో బాలిక గురువారం ఎవరికీ చెప్పకుండా ఒంటరిగానే ముంబైకి వెళ్లేందుకు నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు బాలికను చేరదీసి వివరాలను సేకరించారు. బాలికను ప్రభుత్వ చైల్డ్‌లైన్ హోమ్‌కు తరలించారు. తల్లిదండ్రులకు కుమార్తెను వారికి అప్పగించేందుకు చైల్డ్‌లైన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

### స్కిల్ డెవలప్‌మెంట్‌లో
## బీసీ నిరుద్యోగ యువతకు శిక్షణ

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** ప్రీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద బీసీ నిరుద్యోగ యువతకు 90 రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ కింద శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఆశన్న తెలిపారు. కుషాయిగూడలోని ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు వంద మంది అభ్యర్థులకు ట్రైనింగ్ అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్‌లు లభిస్తాయన్నారు. టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 25 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు ఈనెల24లోపు www.tgbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, ఎస్‌ఎస్‌సీ మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

# ఇంటి శుభ్రతతో వ్యాధులకు చెక్



**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** వర్షాకాలంలో ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందంటున్నారు చెఫ్ కునాల్ కపూర్. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడానికి వినూత్న పద్ధతులను అనుసరించాలని సూచిస్తున్నారు. వేప నూనెతో ఫ్లోర్‌ను శుభ్రం చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయంటున్నారు.

### ఫ్లోర్ పొడిగా ఉండాలి

వర్షాకాలంలో తేమ అధికంగా ఉంటుంది. తేమ వాతావరణంలో కంటికి కనిపించని సూక్ష్మజీవులు అధికంగా వృద్ధి చెందే అవకాశాలున్నాయి. వీలైనంత వరకు ఫ్లోరింగ్ పొడిగా ఉండేలా చూసుకోవాలి. నునుపుగా ఉండే టైల్స్‌పై నీరు పడితే కాలు జారే ప్రమాదం ఉంటుంది. ఫ్లోరింగ్ తడిగా ఉంటే ఎప్పటికప్పుడు తుడిచివేయడం మంచిది.

### డోర్ మ్యాట్స్..

చాలామంది వర్షాకాలంలో డోర్ మ్యాట్స్ తడిచిపోతాయని సరిగా వాడరు. ఈ సీజన్‌లో హెవీ డ్యూటీ రబ్బర్ డోర్ మ్యాట్ బయటవైపు ఉంచడంతోపాటు ఇంటి లోపల నీరు పీల్చుకునే డోర్ మ్యాట్ వాడటం వల్ల ఇల్లు శుభ్రంగా ఉంచుకోవచ్చు.

### డాగ్ ప్రేమికులు జాగ్రత్తగా ఉండాలి

ఇటీవల కాలంలో చాలా మంది కుక్కలు లేదా పిల్లులను పెంచుతున్నారు. వర్షాకాలంలో వాటి కాళ్లు తడవడం వల్ల నేలపై మరకలు పడటంతోపాటు వాటికి అంటువ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. వాటి పాదాలు శుభ్రం చేయడంతోపాటు పెట్ ఫ్రెండ్లీ ఫ్లోర్ క్లీనర్ వాడాలి.

### యాసిడ్, ఫినాయిల్

ఫ్లోర్‌పై మరకలు పోవడానికి కొంతమంది యాసిడ్, ఇల్లు శుభ్రం చేయడానికి ఫినాయిల్ వాడుతుంటారు. వాటివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. కొంతమందికి చర్మ సమస్యలు లాంటివి రావచ్చు. అనారోగ్యం కలిగించే వాటిని వాడకుండా చర్మ ఆరోగ్యం పాడవకుండా ఉండే, ఘాటు వాసన లేని క్లీనర్స్‌ను వాడితే మంచిది.

- వర్షాకాలంలో మంచాలపై దుప్పట్లను వారాల తరబడి మార్చకపోతే సమస్యలు రావచ్చు. మీతోపాటు మీ పెట్స్ కూడా తాజాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటిలో ఎక్కడా నీరు నిల్వకుండా చూసుకోవాలి. వర్షాకాలంలో తడిచిన దుస్తులు వాసన వస్తుంటాయి. వాటిని ఆరబెట్టడానికి చర్యలు తీసుకోవాలి.

### తలుపులు మూసి ఉంచొద్దు

దోమలు వస్తాయని, జల్లు పడుతుందని ఇంటి తలుపులు, కిటికీలను వర్షాకాలంలో మూసి ఉంచొద్దు. ఇంట్లో ఉన్న తేమ, ఇతర చెడు వాసనలు బయటకు పోవడానికి గాలి ప్రసరించడం అవసరం. ఇంట్లో తేమ నివారణకు హ్యూమిడిఫైయర్లు లేదా ఫ్యాన్లను వాడటం మంచిది.



గుర్రపు డెక్క తొలగించిన మైసమ్మచెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్

## మైసమ్మ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు

**కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** బీజేపీ పోరాటంతోనే మైసమ్మ చెరువులో గుర్రపు డెక్క తొలగించారని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. ఈ మేరకు డీసీ, జడ్సీలకు వినతిపత్రం ఇవ్వడంతో పాటు అక్కడి సమస్యపై రెండు నెలలుగా పోరాటం చేశామన్నారు. గురువారం మైసమ్మ చెరువు ప్రాంతాన్ని కార్పొరేటర్ సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఐదు చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు కోసం జీహెచ్‌ఎంసీ రూ.1.6 కోట్లు విడుదల చేశారని, చెరువులు పరిసర ప్రాంత వాసులకు గుర్రపు డెక్క తొలగింపుతో దోమల బెడద తగ్గుతుందని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో మల్లేష్ గౌడ్, పోలారి కిషోర్, సాయి, అబ్బాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు కల్పించాలి

**గాజులరామారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** కైసర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సమస్యలతో చదువులు వెళ్లదీస్తున్నారు. గతంలో పాఠశాలను అభివృద్ధి చేసేందుకు గుత్తకు తీసుకొన్న కాంట్రాక్టర్ సగం పనులు చేసి మధ్యలో వదిలేశాడు. దీంతో విద్యార్థులు దాహం తీర్చుకొనేందుకు తాగునీరు కూడ కరువైంది. మూత్రశాలలు సరిగాలేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు, నాయకులకు ఎన్నిసార్లు విద్యార్థి తల్లిదండ్రులు, స్థానిక నాయకులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గదిని కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

## అక్రమ నిర్మాణం కూల్చివేత

**జీడిమెట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ మండలం, జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ పక్కన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన గదిని రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. స్థానికంగా ఉన్న సంతోష్ అనే వ్యక్తి ఈ స్థలాన్ని ఆక్రమించి కృష్ణ అనే వ్యక్తికి విక్రయించడంతో గదిని నిర్మించి కబ్జాకు పాల్పడ్డారు. ఈ విషయం స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో తహసీల్దార్ రహమాన్ స్పందించి ఆర్ఐ ఖలీల్‌ను కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది నర్సింహ, దుర్గయ్యలు అక్కడికి చేరుకుని గదిని కూల్చివేశారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**గాజులరామారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):** రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూరారం సాయిబాబా నగర్‌కు చెందిన మహమ్మద్ సలీం (44) జ్యోతిమిల్క్ కంపెనీ సమీపంలో ఉన్న బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లో కొంతకాలంగా వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం టీ తాగి రోడ్డు దాటి వస్తున్న క్రమంలో బహదూర్‌పల్లి వైపు నుంచి రత్న సాయి కిషోర్ బైకుపై వేగంగా వచ్చి మహమ్మద్ సలీంను ఢీకొట్టాడు. సలీం అక్కడే మృతి చెందగా రత్న సాయికి తీవ్ర గాయాలై సమీపంలో ఉన్న మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.